కల్పవల్లి.. మూల పెద్దమ్మ

మండల కేంద్రంలో కొలువైన మూల పెద్దమ్మ భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా వెలుగొందుతున్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటూ రోజురోజుకూ భక్తులను పెంచుకుంటున్నారు. కొలిచే వారికి కొంగుబంగారంగా నిలుస్తున్న మూల పెద్దమ్మ భక్తుల నుంచి పూజలందుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ నెల 23 నుంచి వచ్చే నెల 24 వ తేదీ వరకు నెల రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. – గడివేముల

- కొలిచే వారికి కొంగు బంగారం
- ఈనెల 23 నుంచి వచ్చే నెల 24 వరకు పెద్దమ్మ జాతర
- ప్రతి మంగళవారం ఘనంగా ఉత్సవాలు
- ఆలయ చైర్మన్, ఈఓ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి


భక్తులకు దర్శనమిస్తున్న మూల పెద్దమ్మ అమ్మవారు

ఏటా ఉగాది పండుగ మరుసటి రోజు మూల పెద్దమ్మ జాతర ప్రారంభమవుతుంది. అందులో భాగంగా ఈ ఏడాది ఈ నెల 23న జాతర మొదలై ఏప్రిల్ 24వ తేదీతో ముగుస్తుంది. ఈ నెల రోజుల్లోని ఆది, మంగళవారాలు అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దాతల సహకారంతో ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని కూడా సుందరంగా తీర్చిదిద్దారు. 23 అమ్మవారికి ఆకు పూజ, కుంకుమార్చనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అదే రోజు సాయంత్రం అమ్మవారి ఘటానికి వెళ్లటం, బోనాలు తదితర పూజలు ఉంటాయి. ఆ తర్వాత ప్రతి మంగళవారం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోనున్నారు. జాతర సందర్భంగా భక్తుల కాలక్షేపం కోసం సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాట్లు చేశారు. 23న రాత్రి సినీ ఆర్కెస్ట్రా, 24న బైక్ స్లో పందెం, గుండు ఎత్తడం, తాడు లాగడం తదితర పోటీలు ఉంటాయి. ఇక ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు నాలుగు చెక్‌పోస్టులు ఏర్పాటు చేయనున్నారు. భారీ వాహనాలు గ్రామంలోకి రాకుండా దారి మళ్లించనున్నారు.


మూల పెద్దమ్మ జాతరకు ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం



మూల పెద్దమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకున్నాం. నెల రోజుల పాటు ప్రతి మంగళవారం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధికంగా వస్తుంటారు. రద్దీని దృష్టిలో పెట్టుకుని అన్నిశాఖల అధికారుల సహకారంతో భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. – తలారి చిన్నన్న, చైర్మన్, మూల పెద్దమ్మ ఆలయం

భక్తులకు ప్రత్యేక బస్సు సౌకర్యం



మూల పెద్దమ్మ జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం నంద్యాల, నందికొట్కూరు, ఆత్మకూరు ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. భక్తులు బస్సు సర్వీసులను సద్వినియోగం చేసుకుని అమ్మవారిని దర్శించుకోవాలి.
– మోహన్, ఈఓ, మూల పెద్దమ్మ ఆలయం

క్లుప్తంగా

అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలి


తహసీల్దార్‌కు వినతి ప్రతం అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పాణ్యం: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సోమవారం తహసీల్దార్ మల్లికార్జునరెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ వేతనాలు పెంచాలని, ముఖఆధారిత హాజరు రద్దు చేయాలని కోరారు. వర్కర్లను, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో అంగన్‌వాడీలు వెంకటమ్మ, సూర్యప్రభావతి, ధనలక్ష్మి, హైమావతి, అపర్ణ, ఆదిలక్ష్మి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

అనాథ యువకుడికి కుట్టు మిషన్


కుట్టుమిషన్‌ను అందజేస్తున్న ఎద్దుల మహేశ్వరరెడ్డి

కోడుమూరు రూరల్: కోడుమూరుకు చెందిన బోయ రవికి తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోవడంతో ఆదరించే వారు లేక దొరికిన చోట టైలర్ షాపుల్లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. విషయం తెలుసుకున్న భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి సోమవారం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి బోయ రవి ఇంటి వద్దకు వెళ్లి యువకుడి దీనస్థితిని తెలుసుకుని చలించిపోయాడు. రవి సొంతంగా జీవించేలా జీవనోపాధికి కుట్టుమిషన్‌ను అందజేశారు.

నిధులు మంజూరు


రహదారిని పరిశీలిస్తున్న డీఈ గంగాధర్

గడివేముల: రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు పంచాయతీ రాజ్ డీఈ గంగాధర్ తెలిపారు. గడివేముల – రేగడగూడూరు, గని – ఒండుట్ల గ్రామాల రోడ్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ గడివేముల నుంచి రేగడగూడూరు గ్రామం వరకు నూతనంగా తారు రోడ్డు నిర్మించేందుకు రూ.23 లక్షలు, గని – ఒండుట్ల రహదారికి రూ.26 లక్షలు మంజూరయ్యాయన్నారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఆయన వెంట ఇంజినీరింగ్ అసిస్టెంట్ వెంకటేష్ ఉన్నారు.

దంత సమస్యలపై అవగాహన


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాణ్యం: ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక సీహెచ్‌సీ సిబ్బంది సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. దంత సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ దంత సమస్యలు పట్ల నిర్లక్ష్యం చేయొద్దన్నారు. తంబాకు, పాన్‌మసాలా తదితర చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.

పాడి రైతులకు ప్రోత్సాహం


గడివేములలో బోనస్ డబ్బులను అందిస్తున్న డీడీ రాజేష్

గడివేముల: జిల్లాలోని పాడి రైతులను విజయ డెయిరీ ప్రోత్సహిస్తోందని డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ రాజేష్ అన్నారు. విజయ డెయిరీకి పాలను విక్రయిస్తున్న గడివేముల, బూజునూరు, పెసరవాయి గ్రామాల రైతులకు మంజురైన బోనస్‌ను సోమవారం ఆయన అందించారు. ఈ సందర్భంగా డీడీ రాజేష్ మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మధుసూదనరెడ్డి, విజయ డెయిరీ నిర్వాహకుడు నారాయణ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ

కర్నూలు(రాజ్‌విహార్):విద్యుత్ వినియోగదారుల సమస్యలు తెలుసుకునేందుకు నేడు డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 నుంచి 11గంటల వరకు కర్నూలు, నంద్యాల జిల్లాల వినియోగదారులు సెల్: 7382614308 నంబరుకు ఫోన్ చేసి సమస్యలు తెలియజేసి పరిష్కారం పొందాలని సూచించారు.

స్పందన సమస్యలను పరిష్కరించండి

సి.బెళగల్: ప్రజల సమస్యలను వెంటనే పరిష్కారం అయ్యేలా చూడాలని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో మండల అధికారులతో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఎంపీడీఓ రాముడుతో కలిసి తహసీల్దార్ మండల, గ్రామ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. స్పందనలో ఈఓఆర్డీ సందీప్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, ఏఓ మల్లేష్‌కుమార్, హౌసింగ్ ఏఈ సుమంత్, వీఆర్వోలు ఉన్నారు. కాగా స్పందన కార్యక్రమానికి పలువురు అధికారులు గైర్హాజరయ్యారు.

భవన నిర్మాణాల పరిశీలన

గూడూరు రూరల్: మండల పరిధిలోని కె.నాగలాపురంలో చేపట్టిన సచివాలయం, ఆర్‌బీకే భవన నిర్మాణాలను సోమవారం పీఆర్ ఏఈ గోపాల్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం, ఆర్‌బీకే భవన నిర్మాణాలు 90 శాతం వరకు పనులు పూర్తి కావచ్చాయన్నారు. మిగిలిన పనులను కాంట్రాక్టర్‌తో పూర్తి చేయించి రెండు నెలల్లో భవనాలను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా మారెప్ప

గూడూరు రూరల్: మండల పరిధిలోని జూలకల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మారెప్పను సోమవారం యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కర్నూలులోని కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో తనను జిల్లా నాయకులు గౌరవాధ్యక్షుడిగా ఎన్నుకున్నారని మారెప్ప తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

- కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి


కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

కోడుమూరు రూరల్: క్రీడలతో మానసికోల్లాసం పెంపొంది స్నేహపూరిత వాతావరణం అలవడుతుందని కుడా చైర్మన్, వైఎస్సార్ సీపీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. హంద్రీనది ఒడ్డున వెలసిన వల్లెలాంబదేవి తిరుణాలను పురస్కరించుకుని సోమవారం ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను హర్షవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా గ్రామీణ క్రీడాకారుల్లో దాగివున్న నైపుణ్యాలు వెలుగులోకొస్తాయన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని క్రీడాకారులంతా స్నేహపూరిత వాతావరణంలో ఆడాలని సూచించారు. అంతకుముందు ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి, పులకుర్తి సర్పంచు ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్‌ను అప్‌డేట్ చేయించుకోవాలి


కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ రమాదేవి

కోడుమూరు రూరల్: ఉపాధి కూలీలు ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయించుకోవడంతో పాటు బ్యాంకు ఖాతాలకు అనుసంధానం చేయించుకోవాలని ఏపీఓ రమాదేవి సూచించారు. సోమవారం మండలంలోని పులకుర్తి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీఓ తనిఖీ చేసి కూలీలతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధార్ అప్‌డేట్ చేసుకునేందుకు అవకాశం కల్పించిందని, ఆయా గ్రామ సచివాలయాల్లో ఆధార్ నమోదు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. కూలీలు తమ ఆధార్ కార్డుల్లో ఎవైనా పొరపాట్లు ఉంటే సరిచేయించుకోవాలన్నారు. అలాగే వేసవి దృష్ట్యా కూలీలంతా ఉదయం వేళల్లోనే త్వరగా పనుల్లోకి వచ్చి మధ్యాహ్నంలోగా పనులు ముగించుకొని వెళ్లాలని, రెండుమార్లు హాజరు తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. గ్రామాల్లో పనులు అవసరమైన కూలీలు ముందుకొస్తే వారందరికి కూడా ఉపాధి పనులు కల్పించడం జరుగుతుందని ఏపీఓ పేర్కొన్నారు.

ఐదుగురికి అరుదైన గుండె ఆపరేషన్లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో 20 రోజుల వ్యవధిలో ఐదుగురికి అరుదైన గుండె శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆసుపత్రిలోని కార్డియోథొరాసిక్ సర్జరీ విభాగంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి సమక్షంలో ఆయన వివరాలు వెల్లడించారు. గత ఫిబ్రవరి 28న కర్నూలు అశోక్‌నగర్‌కు చెందిన కేదారేశ్వరయ్య(54) అనే ఆటోడ్రైవర్‌కు కరనరి ఆర్టరీ బైపాస్ గ్రాఫ్ట్ ఆపరేషన్ చేశామన్నారు. అలాగే ప్రకాశం జిల్లా దర్శికి చెందిన పుల్లారెడ్డి(35) అనే రైతుకు టీబీ వల్ల ఊపిరితిత్తులు దెబ్బతింటే ఈనెల ఒకటో తేదీన న్యూమోనెక్టమి ఆపరేషన్ చేశామన్నారు. కోసిగికి చెందిన లక్ష్మన్న(30) అనే దివ్యాంగుడికి ఈ నెల 30న మైట్రల్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ ఆపరేషన్ చేసినట్లు వివరించారు. అనంతపురం పట్టణం నుంచి కత్తిపోటుతో వచ్చిన శ్రీనివాసరెడ్డి(50) అనే వ్యక్తికి ఈ నెల 12వ తేదీన అత్యవసర ఆపరేషన్ చేసి కత్తి తొలగించామన్నారు. కర్నూలు మండలం బి.తాండ్రపాడుకు చెందిన నిహంత్ (7) అనే బాలుడికి అతి క్లిష్టమైన వీఎస్డీ క్లోజర్, పాత్ రీ రూటింగ్ ఆపరేషన్‌ను ఈ నెల 7వ తేదీన నిర్వహించామన్నారు. వీరందరికీ డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీలో ఆపరేషన్లు ఉచితంగా చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం వారంతా కోలుకుని డిశ్చార్జ్ అయినట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇతర జిల్లాల నుంచి కూడా ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేయించుకునేందుకు రోగులు ఇక్కడికి వస్తున్నారని తెలిపారు. ఈ ఆపరేషన్లను అనెస్తీషియా ప్రొఫెసర్ డాక్టర్ కొండారెడ్డి, ఫర్ఫ్యూజనిస్టు రమేష్‌రెడ్డి సహకారంతో నిర్వహించినట్లు పేర్కొన్నారు.

సుంకేసులకు ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసులకు సోమవారం 1.590 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. డ్యాంలో 1.068 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కేసీ కాల్వకు 505 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

కోలుకోలేక యువకుడి మృతి

ఓర్వకల్లు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు కోలుకోలేక మృతిచెందాడు. ఎస్‌ఐ మల్లికార్జున తెలిపిన వివరాలు.. తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లా గట్టు మండలం ఆలూరు గ్రామానికి చెందిన కలికుండ సవారన్న(22) కొన్నేళ్ల నుంచి కాల్వబుగ్గ వద్ద ఉన్న మౌలాలి ఇటుకల ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. ఈనెల 18న వ్యక్తిగత పనిమీద మోటార్ సైకిల్‌పై కాల్వబుగ్గకు బయలుదేరాడు. ఇటుకల ఫ్యాక్టరీ వద్దకు చేరుకుకోగానే వెనుక నుంచి అతివేగంగా వస్తున్న కర్ణాటక వాహనం మోటార్ సైకిల్‌ను ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సవారన్నను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడు తండ్రి గోకారన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

కోడుమూరు రూరల్: స్పందనలో భాగంగా ప్రజలు, రైతుల నుంచి వచ్చే సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుని వేగంగా పరిష్కరించాలని తహసీల్దార్ శేషఫణి వీఆర్వోలకు సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి ఆయా సమస్యలపై వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లోని రైతుల నుంచి వినతుల పరిష్కారానికి వీఆర్వోలు ప్రత్యేక చర్యలు తసుకోవడంతో పాటు, ఆయా రైతులతో మాట్లాడి అవసరమైన పత్రాలు తెప్పించుకుని త్వరగా భూ సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఏడుకొండలు, ఏఈ ప్రసాద్, ఈఓఆర్డీ మంజుల, ఏపీఎం పుష్పావతి తదితరులున్నారు.

పోస్టల్ ఖాతాలు తెరవండి


పోలకల్‌లో ఉపాధి సిబ్బంది, ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు

సి.బెళగల్: ఉపాధి కూలీలకు పోస్టల్ సేవింగ్ ఖాతాలను తెరిపించాలని ఎంపీడీఓ రాముడు మండల ఉపాధి హామీ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆయన పోల కల్, సి.బెళగల్ గ్రామాల్లో పర్యటించి పోస్టల్ సేవింగ్ ఖాతాల అవసరంపై అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లోని పోస్టల్ కార్యాలయాలను సందర్శించి కూలీలు ఖాతాలను తెరిచేందుకు వచ్చే దరఖాస్తులను స్వీకరించి వెంటనే ఖాతా నెంబర్లను జారీ చేయాలని ఆశాఖ అధికారులను, సిబ్బందిని కోరారు. కూలీల ఖాతాలకు ఆధార్ నెంబర్‌లను లింక్ చేయకపోవడంతో వారి వేతనాలు సస్పెండ్‌లో ఉన్నాయని, ఆధార్ నెంబర్లతో కొత్త ఖాతాలు తెరిచే వారందరికి వేతనాలు ఖాతాలకు జమ అవుతాయని ఎంపీడీఓ తెలిపారు.

గోరంట్ల మాధవుడికి రూ.14.5 లక్షల ఆదాయం


కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్: మండలంలోని గోరంట్ల లక్ష్మీమాధవస్వామికి రూ.14.5లక్ష ఆదాయం సమకూరింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయానికి వివిధ రూపాల్లో వచ్చిన ఆదాయాన్ని, భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం దేవదాయశాఖ అధికారులు లెక్కించారు. పర్మినెంట్ హుండీలో భక్తులు సమర్పించిన కానుకలు రూ.5,68,210, అన్నదానానికి రూ.2,96,381, తాత్కాలిక హుండీ ద్వారా రూ.4,66,715, సేవా టిక్కెట్ల ద్వారా రూ.81,195లు, దుకాణాల ద్వారా రూ.31,986, అన్నదానం రసీదుల ద్వారా రూ.42,250ల చొప్పు న మొత్తం రూ.14,86,737 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ గుర్రెడ్డి తెలిపారు. హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమంలో దేవదాయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి


స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్) : నగరంలోని బుధవారపేట, రామప్రియ నగర్, స్వామిరెడ్డి నగర్‌లలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆయా ప్రాంతాలకు చెందిన మన్సూర్, జ్ఞాన ప్రసన్న, చెన్నయ్య నగరపాలక అధికారులను కోరారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో కమిషనర్ భార్గవ్‌తేజ స్పందన కార్యక్రమం నిర్వహించారు.పలువురు వివిధ సమస్యలపై కమిషనర్‌ను కలిసి వినతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎస్ఈ శేష సాయి, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, మేనేజర్ చిన్నరాముడు, ఆర్ఓ జునీద్ పాల్గొన్నారు

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. సోమవారం స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని కొండారెడ్డి బురుజు వద్ద అభివృద్ధి, బ్యూటిఫికేషన్‌కు సంబంధించిన పనులను పరిశీలించారు. అక్కడే ఉన్న ఏఈ దినేష్‌ను పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చెన్నమ్మ సర్కిల్ సమీపంలోని సుంకులమ్మ గుడి వద్ద డివైడర్, డ్రైనేజీ సంబంధ పనులు పరిశీలించారు.

అమ్మలా ఆదరించి..

- డౌన్ సింద్రోమ్ పిల్లల సేవలో అంబికా శిశు కేంద్రం
- ప్రత్యేక శిక్షణ, చికిత్స ద్వారా జీవన విధానంలో మార్పు
- సొంతకాళ్ల మీద నిలబడే విధంగా ప్రోత్సాహం



☛ ఈ యువతి పేరు అంజనమ్మ. జన్యు సంబంధ వ్యాధితో బాధపడుతున్న ఈ యువతిని మూడేళ్ల వయసులో తల్లిదండ్రులు అంబికా శిశు కేంద్రంలో చేర్పించారు. ప్రస్తుతం స్పష్టంగా మాట్లాడలేకపోయినా తన భావాలను అభిప్రాయాలను హావ భావాలతో స్పష్టంగా వ్యక్తీకరించగలుగుతుంది. ఉత్సాహంగా ఉంటూ తన తోటి వారందరికీ సహాయపడుతోంది. టైలరింగ్ నేర్చుకుని తన కాళ్లపై తాను నిలబడాలని లక్ష్యంగా పెట్టుకుంది.



☛ కెమెరా పట్టుకున్న ఈ యువకుడి పేరు ఎల్.వి.ప్రశాంత్. మానసిక వైకల్యంతో పుట్టిన ఈ యువకుడిని తల్లిదండ్రులు అంబికా శిశు కేంద్రంలో చేర్పించి ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. ప్రస్తుతం తన పనులు తాను చేసుకోవడంతో పాటు తండ్రికి జిరాక్స్ దుకాణంలో సహాయపడుతున్నాడు. తనకు ఫొటోలు తీయడం అంటే చాలా ఇష్టమని, ఈ రంగంలో స్థిరపడాలని ఉందని చెబుతున్నాడు.


నగరంలోని అంబికా శిశు కేంద్రం


మానసిక లోపం ఉన్న చిన్నారులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: కొందరు పిల్లల్లో మానసిక, భౌతిక పరమైన వికాసం సరిగ్గా ఉండదు. ఈ లక్షణాలను వారి ముఖంలోని మార్పుల ఆధారంగా గుర్తిస్తారు. జన్యు సంబంధమైన ఈ వ్యాధిని డౌన్ సింద్రోమ్ అంటారు. పుట్టుకతో వచ్చే దీనిని నయం చేయలేం. అయితే, ఈ లక్షణాలతో పుట్టిన పిల్లలకు చేరదీసి జీవితంపై భరోసా కల్పిస్తోంది అంబికా శిశు కేంద్రం. అంతేకాదు వివిధ రంగాల్లో సాధారణ పిల్లలతో పోటీపడేలా తరీఫ్దు ఇస్తోంది. నేడు డౌన్ సింద్రోమ్ డే సందర్భంగా ఆ స్వచ్ఛంద సేవా సంస్థపై ప్రత్యేక కథనం.

హేమ్‌చంద్, దేవ్‌చంద్ చారిటీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 1995 సెప్టెంబర్ 26న అంబికా శిశు కేంద్రం ఏర్పాటైంది. ప్రకాష్ నగర్‌లోని ఈ కేంద్రంలో నిపుణులైన వైద్యులు, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో సెరిబ్రల్ పాల్సీ, బుద్ధి మాంద్యం, ఆటిజమ్, బహుళ వైకల్యాలు గల విభిన్న ప్రతిభాంతులైన వారికి చికిత్స చేస్తున్నారు. అలాగే మానసిక లోపం ఉన్న చిన్నారులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధిస్తున్నారు. నేషనల్ ట్రస్ట్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెరిబ్రల్‌ప్లాసీ, అరుణిమ్ వెల్ఫేర్ ఆఫ్ డిజేబుల్డ్ అండ్ సీనియర్ సిటీజన్ సంస్థలతో కలిసి పనిచేస్తున్న అంబికా శిశు కేంద్రం ఇప్పటి వరకు సుమారు 9 వేల మంది బహుళ వైకల్యాలు గల విభిన్న ప్రతిభావంతులకు సేవలు అందించింది.

నైపుణ్యాభివృద్ధిలో ప్రత్యేక శిక్షణ

మానసిక లోపంతో పుడుతున్న పిల్లలకు అవసరమైన రీతిలో విద్యను అందించేందుకు అంబికా శిశు కేంద్రం నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. నిపుణులైన ఉపాధ్యాయుల ద్వారా విద్యను అందిస్తున్నారు. పిల్లలకు ప్రీ, ప్రత్యేక పాఠశాలల్లో పాఠాలు చెబుతున్నారు. ప్రస్తుతం 170 మంది ఉండగా ప్రత్యేక పాఠశాలలో 30 మంది చదువుతున్నారు. ప్రత్యేక పాఠశాలలో పిల్లలకు ప్రాథమిక విద్యతో పాటు సామాజిక బాధ్యతలు, సామాజిక స్పృహ, ఇతరులపై ఆధారపడకుండా జీవించడం చదవడం, రాయడం లాంటివన్నీ నేర్పిస్తున్నారు. అలాగే వృతి నైపుణ్య రంగాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. స్వయం ఉపాధి పొందేలా తీర్చిదిద్దుతున్నారు. సాధారణ విద్యార్థులకు తీసిపోని విధంగా మానసిక వ్యాధితో ఇబ్బంది పడుతున్న చిన్నారులకు కంప్యూటర్ సంబంధ కోర్సుల్లో సైతం తర్ఫీదు ఇస్తున్నారు.

సేవలన్నీ ఉచితం



మానసిక లోపం ఉన్న చిన్నారులకు మా కేంద్రంలో అన్ని రకాల సేవలు ఉచితంగా అందిస్తున్నాం. వారిలో ఆత్మస్థైర్యం నింపే ప్రయత్నం చేస్తున్నాం. దివ్యాంగ పిల్లలతో ఎలా వ్యవహరించాలో తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ కూడా ఇస్తున్నాం. ఫిజియో థెరపీ, స్పీచ్ థెరపీలలో శిక్షణ ఇస్తున్నాం. మానసిక లోపం గల పిల్లలు ఉంటే తమ కేంద్రంలో చేర్పించొచ్చు. నిపుణులైన ఉపాధ్యాయులు, డాక్టర్ల ద్వారా వారు సాధారణ పిల్లల్లా రాణించేలా తయారు చేస్తాం. సేవే లక్ష్యంగా ఈ కేంద్రం నడుస్తోంది.
–బిందు ఎన్‌షా డైరెక్టర్, అంబికా శిశు కేంద్రం